
సాక్షి మంచిర్యాల

మంగళవారం । 20 । జూన్ । 2023



ఆలయాలకు మహర్దశ

ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు మహర్దశ రానుంది. దూప దీప నైవేద్యం కింద మరో 638 ఆలయాలు ఎంపికయ్యాయి. నిత్యపూజ, నైవేద్యం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 8లో ▸

'పది' పరీక్షలకు 114 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా ఐదో రోజు సోమవారం నిర్వహించిన సామాన్య శాస్త్రం పరీక్షకు 114 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఏడు పరీక్ష కేంద్రాల్లో 715 మంది విద్యార్థులకు గాను 601 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /30.0

ఆకాశం ఉదయం పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. దక్షిణ నైరుతి దిశగా గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రతీ రోజు మొక్కలకు నీళ్లు పోయాలి



పాఠశాలలో మొక్కలకు నీళ్లు పోస్తున్న కలెక్టర్

లక్సెట్టిపేట: ప్రతీ రోజు మొక్కలకు నీళ్ల పోయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సూరారం గ్రామంలో, స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో సోమవారం హరితోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు పర్యావరణాన్ని కాపాడుతాయని, కాలుష్యాన్ని నియంత్రిస్తాయని అన్నారు. అనంతరం పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్, డీఆర్‌డీవో శేషాద్రి, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్లంపల్లి చైర్‌పర్సన్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్వేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన హరితోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అవార్డును అందజేశారు. మున్సిపాలిటీలో రెండు చోట్ల కొత్తగా ఏర్పాటు చేసిన పార్కులు, కన్నాల నర్సరీ, పట్టణంలో నాటిన మొక్కలను సమర్థవంతంగా జియో ట్యాగింగ్ చేయించి జిల్లా స్థాయిలో అత్యుత్తమ నర్సరీలుగా ఎంపిక కావడానికి దోహదపడినందుకు ఉత్తమ చైర్‌పర్సన్‌గా శ్వేతను ఎంపిక చేసి ప్రభుత్వం అవార్డు అందజేసింది.

ఉత్తమ పురస్కారాలకు అధ్యాపకుల ఎంపిక

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే విద్యాదినోత్సవంలో అత్యుత్తమ సేవలందించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం కళాశాల విద్యాశాఖ పురస్కారాలు అందజేయనుంది. పురస్కారాలకు ఎంపికైన జాబితాను మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయానికి పంపింది. ఉత్తమ ప్రిన్సిపాల్‌గా లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జై కిషన్‌ఓజా, ఉత్తమ అధ్యాపకులుగా టీఎస్.ప్రవీణ్‌కుమార్(బెల్లంపల్లి డిగ్రీ కళాశాల), గంగయ్య(లక్సెట్టిపేట), కుమారస్వామి (లక్సెట్టిపేట), తిరుపతి(ఎన్‌సీసీ ఆఫీసర్, మంచిర్యాల) ఎంపికయ్యారు. స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే విద్యాదినోత్సవ ఉత్సవాల్లో కలెక్టర్ సన్మానిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు.

22న జెడ్పీ ప్రత్యేక సమావేశం

మంచిర్యాలటౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు, అమరుల సంస్మరణను పురస్కరించుకుని ఈ నెల 22న ఉదయం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల కార్యాచరణలో భాగంగా 22న ప్రతీ గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి, అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించాలని తెలిపారు.

బాక్సింగ్ క్రీడాకారుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించిన 5వ జూనియర్ బాలుర, 6వ జూనియర్ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఇంచార్జి కొట్టె దేవేందర్, కోచ్ సీహెచ్.రాజేశ్ తెలిపారు. బాలుర విభాగం నుంచి ప్రేమ్‌కుమార్ వెండి, మణికంఠ రజత పతకాలు, బాలికల విభాగం నుంచి జ్యోతిక, సంస్కృతిలు రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులను ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.నివాస్‌గౌడ్, ఎం.శేఖర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

చదువు కొనాలే!

ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారులు జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. తమ స్కూల్‌కు సంబంధించిన పుస్తకాలు ఆ షాపులో మాత్రమే లభ్యమవుతాయని చెప్పడంతో ఇక్కడికి తమ తల్లిదండ్రులతో వచ్చి ఇలా బుక్స్ తీసుకెళ్తున్నారు. మంగళవారం ఆ బుక్ స్టాల్ పుస్తకాల విక్రయాలతో రద్దీగా ఉంది.



పుస్తకాల కొనుగోలుకు దుకాణం ఎదుట బారులు

జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తమ ఇద్దరు అమ్మాయిలను చదివిస్తున్న ఓ తండ్రి పిల్లలకు బుక్స్ తీసుకునేందుకు రెండ్రోజులపాటు ఆ బుక్ స్టాల్ చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఎప్పుడు వెళ్లినా విపరీతమైన రద్దీ ఉండడంతో చివరకు రాత్రివేళ వెళ్లి ఆ స్కూల్‌కు సంబంధించిన బుక్స్ తీసుకున్నారు. ప్రైవేటు స్కూళ్లు ఒకే షాపుతో ముందస్తు ఒప్పందం చేసుకుని ఆ బుక్ స్టాల్ కేంద్రంగానే అన్ని పుస్తకాలు విక్రయిస్తుండడంతో ఈ పరిస్థితి ఉంది.

- బుక్‌ల నుంచి బూట్లు, సాక్సుల దాకా విక్రయాలు
- అంతర్గత ఒప్పందాలతో దుకాణాల్లో అమ్మకాలు
- నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లు
- కఠిన చర్యలు లేక ఇష్టారాజ్యం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రైవేటు స్కూళ్లు ట్యూషన్ ఫీజులే కాక ఇంకా అనేక విక్రయాలు చేస్తూ తల్లిదండ్రుల నుంచి డబ్బు గుంజుతున్నాయి. తమ స్కూళ్లలో చదివే విద్యార్థులకు యూనిఫాం, షూ, టై, పుస్తకాలు, బుక్‌లు తాము చెప్పిన చోటే కొనుగోలు చేయాలని చెబుతూ అందినకాడికి దండుకుంటున్నాయి. ఒకేచోట లభ్యమవుతాయని చెబుతూ తల్లిదండ్రులు ఆ షాపుల్లోనే తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. మార్కెట్‌లో లభించే వాటికన్నా ఒప్పందం ఉన్న దుకాణం వాళ్లు చెప్పిన ధరలకే తీసుకోవాల్సి వస్తోంది. ఈ నెల 12నుంచి వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు ప్రారంభమయ్యాయి. స్కూళ్లు రెండ్రోజుల ముందు నుంచే విద్యార్థుల తరగతులకు సంబంధించిన అకాడమిక్ పుస్తకాలు, నోట్‌బుక్‌లు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నాయి. జిల్లాలో 191 ప్రైవేటు స్కూళ్లు ఉండగా 51,543 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో ఎక్కువ బడ్జెట్ స్కూళ్లు ఉండగా, జిల్లా కేంద్రంతో పట్టణాల్లో టెన్త్ వరకు బోధించేవి ఉన్నాయి. పోటాపోటీగా ప్రైవేటు విద్యాసంస్థలు వెలుస్తున్నాయి. వీటిలో మధ్యస్థ స్థాయి స్కూళ్ల నుంచి కార్పొరేట్ స్థాయి వరకు ఉన్నాయి. ఆయా స్కూళ్లలో తమ ప్రత్యేక కరిక్యులంగా చెప్పుకుంటూ సొంతంగా పుస్తకాల రూపకల్పన చేస్తున్నాయి. విద్యార్థులకు ఆ పుస్తకాలు కొనివ్వడం తల్లిదండ్రులకు అనివార్యంగా మారాయి.

స్కూల్ ఫీజుల పెంపు

ఇక ట్యూషన్ ఫీజులు ఒక్కో స్కూల్‌లో ఒక్కో తీరుగా ఉన్నాయి. నర్సరీ నుంచి పదో తరగతి వరకు రూ.వేలల్లో ఫీజులు ఉన్నాయి. అడ్మిషన్, డొనేషన్, ట్యూషన్ ఫీజుల పేరిట తల్లిదండ్రులకు వాత పెడుతున్నారు. బడ్జెట్ స్కూళ్లలో ఓ మోస్తరుగా ఉండగా, కాన్వెంట్, కార్పొరేట్ అంటూ చెప్పే స్కూళ్లలో ఫీజుల్లో వ్యత్యాసం ఉంటోంది. జిల్లాలో నర్సరీ క్లాస్‌కే ఫీజు కనీసం రూ.4వేల నుంచి రూ.30వేల వరకు తీసుకుంటున్న ఉన్న స్కూళ్లు ఉన్నాయి. జిల్లా విద్యాశాఖ కఠినంగా వ్యవహరించకపోవడంతోనూ ఫీజుల నియంత్రణ ఉండడం లేదు. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏటా గతేడు ఫీజులో పదిశాతం పెంపు మించరాదు. కానీ కొన్ని స్కూళ్లు అంతకన్నా ఎక్కువగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. ఇక ఏటేటా జిల్లా కేంద్రంలోకి వస్తున్న కార్పొరేట్ స్కూళ్లతో ముందున్న పాఠశాలలు అదే ధోరణికి వెళ్తున్నాయి. దీంతో స్కూళ్లలో పోటీ ఏర్పడి అడ్మిషన్ల నుంచి బోధన దాకా కొత్త ప్రయోగాలు చేస్తూ తల్లిదండ్రులపై భారం వేస్తున్నాయి.

బట్టలు, టై, బూట్లు, సాక్సులు

ఒక్కో స్కూల్‌కు ఒక్కో రకమైన రంగులతో ప్రత్యేక యూనిఫాం ఉన్నాయి. ఈ యూనిఫాం అమ్మకాలు సైతం ఒకే షాపులో లభ్యమయ్యేలా చేస్తున్నారు. మార్కెట్‌లో ఇతర ఏ షాపుల్లో అందుబాటులో ఉంచడం లేదు. దీంతో ఆ యూనిఫాం రెడీమెడ్‌గా కుట్టినవైనా, లేక బట్ట మాత్రమే తీసుకున్నా ఆ షాపులోనే తీసుకోవాలి. యూనిఫాంలోనూ షాపులు, విద్యాసంస్థల మధ్య కమీషన్ల ప్రాతిపదికన వ్యాపారం సాగుతోంది. నాణ్యత, కుట్టు ఉన్నా లేకున్నా వాటినే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక వాటికి తోడు టైలు, బూట్లు, ఆఖరికి సాక్సులు సైతం తాము చెప్పినవే కొనుగోలు చేయాలని అంటున్నారు. వాటిపై స్కూల్ ముద్రలు వేస్తూ, మార్కెట్‌లో దొరికే వాటికన్నా అధిక ధరలకు అమ్మేస్తున్నారు. ఒక్కో స్కూల్ రెండు, మూడు రకాల స్కూల్ యూనిఫాంలు తీసుకోవాల్సి ఉంది. వారాంతం, లేక మధ్యలో ఓ రోజులో వేరే యూనిఫాం, మిగతా రోజుల్లో మరో రకం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర పార్టీల సందర్భాల్లో మరో డ్రెస్‌ల్లో రావాలని ఆదేశిస్తున్నాయి. దీంతో చేసేది లేక విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు చెప్పినట్లుగా ఖర్చు చేస్తున్నారు. ఇలా ప్రైవేటులో చదువుతున్న ప్రతీ పేరెంట్‌పై ఆర్థికంగా అదనపు భారం పడుతోంది. జిల్లాలో ప్రైవేటు స్కూళ్ల నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

12ట్రావెల్స్ బస్సులు సీజ్



మందమర్రి టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వివిధ ప్రాంతాలకు నడుస్తున్న ట్రావెల్స్ బస్సులపై జిల్లా రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు నిరంతరం ఆల్ ఇండియా టూరిస్టు బస్సులు నడుస్తున్నాయి. జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్(డీటీసీ) డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖాధికారి(డీటీఓ) ఎల్.కిష్టయ్య ఆదేశాల మేరకు రవాణా శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి మందమర్రి టోల్ ప్లాజా, ఇందారం ప్రాంతాల్లో మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నాయని మూడు రోజుల తనిఖీల్లో 12 బస్సులను సీజ్ చేసి మంచిర్యాల ఆర్టీసీ బస్ డిపోలో ఉంచారు. విచారణ జరిపి రవాణాశాఖకు బకాయి ఉన్న ట్యాక్సుల వసూలుతోపాటు ఒక్కో బస్సుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా విధిస్తామని డీటీఓ కిష్టయ్య తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు వివేకానంద్‌రెడ్డి, రాహుల్, ఏఎంవీఐలు శ్రీనివాస్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, రవాణా శాఖ అధికారులు బస్సులను సీజ్ చేయడం, ట్రావెల్స్ యజమానులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో పాలిసెట్–2023 విద్యార్థులకు కౌన్సెలింగ్ కొనసాగుతోంది. సోమవారం సర్టిఫికెట్ల ధ్రువీకరణ కోసం స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ర్యాంకు ఆధారంగా కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. పెద్ద ఎత్తున విద్యార్థులు రావడంతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఆప్షన్ల నమోదుపై అధికారులు కౌన్సెలింగ్ చేశారు. మొత్తం 250 మంది విద్యార్థుల సర్టిఫికేట్లను పరిశీలించినట్లు బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రకటించారు.

సర్కారుబడులు.. కార్పొరేట్ హంగులు



ప్రారంభానికి ముస్తాబైన సర్కారు బడి

- నేడు విద్యాదినోత్సవం
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేత
- నోట్‌పుస్తకాల పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా సర్కారు బడుల్లో కార్పొరేట్ తరహాలో ఆధునిక అందుబాటులోకి వస్తున్నాయి. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని హంగులతో తీర్చిదిద్దిన 12పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే 35 పాఠశాలల్లో 18 మొదలయ్యాయి. రెండు జతల యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించనున్నారు. తెలంగాణ సేట్ టెక్నోలాజికల్ సర్వీసెస్ సాయంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ బోధన అమలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌ఎస్(ఇంటరాక్టివ్ ఫ్లాట్ స్క్రీన్) టీవీల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బోధనకు ఏర్పాట్లు చేశారు. విద్యాదినోత్సవం సందర్భంగా విద్యార్థుల ర్యాలీలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఉత్తరాల పంపిణీ, గ్రామాల్లో వీధి నాటకాలు, జాతీయ జెండా ఆవిష్కరణ, పదేళ్ల లోపు పురోగతిపై ప్రసంగం, తెలంగాణలో పాఠశాల విద్య, విజన్ కార్యకలాపాలపై వివరిస్తారు. పాఠశాలలకు సేవలందించిన ముగ్గురు దాతలను సన్మానిస్తారు. 10మంది హెచ్‌ఎంలు, 15 మంది ఉపాధ్యాయులు, ఐదుగురు ఎస్‌ఎంసీ చైర్మన్, ఐదుగురు పేరెంట్స్, 12 మంది 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సత్కరిస్తారు.

జిల్లాలో ఇలా..

మన ఊరు–మనబడిలో 248 పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో 31 బడులను అన్ని హంగులతో తీర్చిదిద్దగా మరో 12 మంగళవారం ఎమ్మెల్యేలు, అధికారులు ప్రారంభించనున్నారు. మందమర్రి(దీపక్‌నగర్), జైపూర్ మండలం దోరగాపల్లి, పవనూర్ (హరిజనవాడ), కోటపల్లి మండలం మల్లంపేట్, పారిపల్లి హైస్కూల్, దండేపల్లి పీఎస్, ఉన్నత పాఠశాలలు, బెల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీఎస్ సీల్వాయి, కుశ్నపల్లి, కాసిపేట మండలం సోనాపూర్, మంచిర్యాల పట్టణంలోని న్యూగర్మిళ్ల పాఠశాలలు లాంఛనంగా ప్రారంభిస్తారు.

పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్‌లు

జిల్లాలో 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు 2.57 లక్షలు నోట్‌పుస్తకాలు కేటాయించారు. జిల్లాకు 50వేలు నోట్ పుస్తకాలు చేరడంతో బెల్లంపల్లి ప్రభుత్వ పాఠశాల, దండేపల్లి మండలం మామిడిపల్లి, కోటపల్లి మండలం పారిపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. 4,32,243 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా ఇప్పటివరకు 2,81,160 పుస్తకాలు చేరాయి. జిల్లాలో 50,032 మంది విద్యార్థులకు అవసరమైన 2,32,750 మీటర్ల ముడి వస్త్రం చేరింది. ఇందులో 80శాతం మేర యూనిఫామ్‌లు పూర్తయిన వాటిని విద్యార్థులకు అందించనున్నారు. 149 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు కానున్నాయి.

హరితహారంలో భాగస్వాములు కావాలి

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



అర్బన్ పార్కులో మొక్కకు నీరు పోస్తున్న సుమన్

చెన్నూర్‌రూరల్: హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో ఉన్న అంబేద్కర్ అర్బన్ పార్కులో సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి హరితహారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారని, అప్పటి నుంచి అటవీ సంపద పెరిగిందని తెలిపారు. అనంతరం హరితోత్సవం విజయాల పోస్టర్లు, వైల్డ్ లైఫ్ ఆఫ్ చెన్నూర్ ఫారెస్టు బుక్‌లను ఆవిష్కరించారు. కాటన్ సంచులు పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శివ్ ఆశిష్‌సింగ్, ఎఫ్‌డీవోలు రమేష్, వినయ్‌కుమార్ సాహూ, వేణుబాబు, ఎఫ్ఆర్వోలు శివకుమార్, రవి, ఎక్బాల్ హుస్సేన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్, డీఆర్డీవో శేషాద్రి, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి పాల్గొన్నారు.

పరిహారం చెక్కుల అందజేత

చెన్నూర్: విద్యుత్ ప్రమాదాల్లో నష్టపోయిన బాధితులకు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విప్ సుమన్ పరిహారం చెక్కులు అందజేశారు. మండలంలో 16 మంది విద్యుత్ ప్రమాదాల్లో నష్టపోయారని, రూ.15.60 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. విద్యుత్ ఏడీ రవికుమార్, ఏఈ కె.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విత్తన స్టోరేజీ ప్రారంభం

భీమారం: అటవీశాఖ భీమారం మండల కేంద్రం సమీపంలోని జోడువాగులవద్ద ఏర్పాటు మొక్కల విత్తన స్టోరేజీని విప్ బాల్క సుమన్ సోమవారం ప్రారంభించారు. జిల్లా స్థాయిలోనే పేరుగాంచిన భీమారం సెంట్రల్ నర్సరీలో మరిన్ని రకాల మొక్కలు పెంచాలని కోరారు. మోడల్ నర్సరీని ప్రారంభించారు. కలెక్టర్ సంతోష్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

కోటపల్లి: గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. సోమవారం మండలంలోని బబ్బరుచెల్క, ఆలుగామ, రొయ్యలపల్లి, ఎదులబంధం, పిన్నారం, నాగంపేట గ్రామాల్లో రూ.12.60లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, ఆలుగామ గ్రామానికి రూ.20లక్షలతో హెల్త్ సబ్ సెంటర్ మంజూరు కాగా పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అజ్గర్, సర్పంచ్‌లు సంతోష్, లక్ష్మణ్‌గౌడ్, పున్నం, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల విద్యార్హత ఇంటర్

- ఎంపికలో కొత్త మార్గదర్శకాలు
- 21 నుంచి 35 ఏళ్ల వారికే అవకాశం
- ప్రాజెక్టుల వారీగా రిజర్వేషన్లు

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నియామకంలో ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఈ పోస్టులకు కనీస విద్యార్హత పదో తరగతి ఉండగా ఇంటర్మీడియెట్‌కు పెంచింది. వయోపరిమితిని 35 ఏళ్లకే పరిమితం చేస్తూ, 21 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారికి మాత్రమే దరఖాస్తుకు అవకాశం కల్పించింది. ప్రాజెక్టుల వారీగా రిజర్వేషన్ ఖరారుకు ఆదేశాలు జారీ చేసింది. ఇకపై కొత్త మార్గదర్శకాల ప్రకారమే ఖాళీలను భర్తీ చేయనున్నారు. ప్రధాన అంగన్‌వాడీ టీచర్‌గా పదోన్నతికి మినీ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కనీసం ఐదేళ్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసి, 45 ఏళ్లలోపు వయస్సు ఉండి, ఇంటర్మీడియెట్ విద్యార్హత ఉండాలి. ఖాళీల భర్తీకి రిజర్వేషన్, రోస్టర్ పాయింట్, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సెంటర్ల విధి విధానాల ఖరారుకు ఆదేశాలను జారీ చేశారు. ఆయా పోస్టులకు గాను అర్హులుగా స్థానికంగా ఉన్న వివాహిత, అర్బన్ ప్రాంతాల్లో అదే వార్డుకు చెందిన వారు, గ్రామీణ ప్రాంతాల్లోనైతే అదే గ్రామ పంచాయతీకి చెందిన వారు, ఏజెన్సీలో సంబంధిత హ్యాబిటేషన్‌కు చెందిన మహిళ అయి ఉండాలి. వితంతువులు, ఒంటరి, అనాథ మహిళలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఎంపిక ప్రక్రియ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ పీవో సభ్యులుగా, నాన్ ట్రైబల్ ప్రాంతాల్లో ఆర్డీవో, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సభ్యులుగా వ్యవహరిస్తారు.

ఖాళీల భర్తీకి నిబంధనలు

జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 895 ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 840 మంది టీచర్లు పనిచేస్తుండగా, 55 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 738 మంది ఆయాలు ఉండగా, 157 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 74 ఉండగా, 59 మంది టీచర్లు ఉండగా, 15 మినీ అంగన్‌వాడీ టీచరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత ఏడాది ఖాళీగా ఉన్న గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులకు గాను పదేళ్లు టీచర్‌గా పనిచేసి, డిగ్రీ అర్హత ఉన్న వారికి అర్హత పరీక్ష నిర్వహించి, మెరిట్ ప్రకారంగా ఎంపికైన వారిని సూపర్‌వైజర్లుగా విధుల్లోకి తీసుకున్నారు. 17 పోస్టులకు గాను జిల్లా నుంచి 8 మంది అంగన్‌వాడీ టీచర్లు పదోన్నతి పొందడంతో ఆయా కేంద్రాల్లోనూ అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. పక్కనే ఉన్న ఇతర అంగన్‌వాడీ టీచర్లకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించి నిర్వహిస్తున్నారు.



మంచిర్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం(ఫైల్)

బెల్లంపల్లిలో అర్బన్ ఫారెస్టు ఏర్పాటు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అర్బన్ ఫారెస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఉన్న కుంటరాములు బస్తీలోని సెంట్రల్ నర్సరీలో హరితోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో రూ.125.84 కోట్ల అంచనాతో అటవీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా విస్తీర్ణంలో 44 శాతం అటవీ ప్రాంతం విస్తరించి ఉందని వివరించారు. 2015నుంచి ఇప్పటివరకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 1.70 కోట్ల మొక్కలు నాటామని వివరించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ వేమనపల్లి, నాగారం అటవీ ప్రాంతంలో రూ.3 కోట్ల అంచనాతో రోడ్డు నిర్మాణానికి సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేశారని వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి మంజూరు చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహు, అటవీ రేంజ్ అధికారి సుభాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి గౌరీశంకర్, ఎఫ్ఎస్ఓ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే, అటవీ శాఖ అధికారి

క్లుప్తంగా

జూలైలో కొత్త వేతనాలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గుగని కార్మికులకు 11వ వేతన ఒప్పంద ప్రకారం జూలైలో కొత్త వేతనాలు చెల్లించడం జరుగుతుందని ఏఐటీయూసీ వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతన ఒప్పందంపై కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సోమవారం సంతకం చేశారని, 21న కోలిండియా నుంచి సర్క్యులర్ రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో జూన్ నెల వేతనాలు జూలై మాసంలో చెల్లించనున్నట్లు తెలిపారు.

లైమ్‌లైట్ అవార్డుకు ఎంపిక


రాచకొండ నాగేశ్వర్‌రావు

కాగజ్‌నగర్‌టౌన్: సామాజిక సేవాదృక్పథంతో పనిచేసిన ఆర్యవైశ్యులకు ఏటా ఇచ్చే లైమ్‌లైట్ అవార్డుకు కాగజ్‌నగర్‌కు చెందిన రాచకొండ నాగేశ్వర్‌రావు ఎన్నికైనట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నుంచి ప్రారంభమైన ఆన్‌లైన్ ఓటింగ్ ఆదివారం రాత్రి ముగిసింది. అవార్డు కోసం వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ, కాగజ్‌నగర్‌కు చెందిన వాసవి మాత వ్రతకల్ప ప్రచారకర్త రాచకొండ నాగేశ్వరరావు పోటీపడగా 3వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఆయన తెలిపారు.

తాటి, ఈత వనం దగ్ధం


దగ్ధమైన తాటి, ఈత చెట్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాదలో ప్రమాదవశాత్తు తాటి, ఈత వనం దగ్ధమైంది. వరి కొయ్యకాల్లకు నిప్పు వేయడంతో సమీపంలో ఉన్న తాటి, ఈత చెట్లకు అంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

ఆలయాలకు మహర్దశ



ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలకు నిత్యం ధూప దీప నైవేద్యాలు జరగాలన్న ఉద్దేశంతో పాటు, అర్చకులకు ఉపాధి కల్పించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ధూప దీప నైవేద్య(డీడీఎస్) పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా నెలకు గౌరవ వేతనం రూ. 2వేలు చెల్లించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ రూ.2వేలు ఉన్న వేతనాన్ని రూ.6 వేలకు పెంచారు.

- ఉమ్మడి జిల్లాకు 184 పోస్టులు మంజూరు
- ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారు 484 మంది
- తాజా నిర్ణయంతో 638కి చేరిన డీడీఎస్ అర్చకులు
- ఇటీవలే రూ.10వేలకు పెరిగిన గౌరవ వేతనం

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రస్తుతం డీడీఎస్ అర్చకుల సంఖ్య	నూతనంగా మంజూరైన అర్చకుల సంఖ్య	మొత్తం
ఆదిలాబాద్	111	24	135
కుమురంభీం	69	09	78
మంచిర్యాల	142	18	160
నిర్మల్	162	103	265
మొత్తం	484	154	638

నిర్వహణ ఇలా..
దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధూప దీప నైవేద్యం పథకం కొనసాగుతుంది. ఆలయాల్లో విధులు నిర్వహించే అర్చకులు ప్రతీరోజు ఆలయంలో నిత్యపూజ, నైవేద్యంతో పాటు పండుగలు, ఉత్సవాల సమయాల్లో ప్రత్యేక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రస్తుతం డీడీఎస్ అర్చకులకు నెలకు రూ.6వేలు చెల్లిస్తుండగా అందులోంచి నూనె, ప్రసాదం, ఇతర ఖర్చులకు రూ.2వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. సీఎం కేసీఆర్ ఇటీవల మంచిర్యాల పర్యటనలో భాగంగా డీడీఎస్ అర్చకులకు ఇచ్చే వేతనం రూ.10వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో 484 మంది అర్చకులు
పథకం ప్రారంభమైన నాటి నుంచి నాలుగు విడతలుగా 484 మంది అర్చకులను నియమించారు. తాజాగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 154 పోస్టులకు నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో వీటి సంఖ్య 638కి చేరింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 9, మంచిర్యాలలో 18, ఆదిలాబాద్‌లో 24, నిర్మల్‌లో 103 ఆలయాలకు అర్చకులను నియమించింది. వీరికి ఈ నెల 25న ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఉత్తర్వులు అందజేయనున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో అర్చకులకు డీడీఎస్ పథకంలో అవకాశం కల్పించడం హర్షణీయం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. కానీ జిల్లాలో కేవలం 9 మందికే అవకాశం కల్పించడంతో చాలామందికి నిరాశే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి పూర్తిస్థాయిలో అర్చకులకు అవకాశం కల్పించాలి.
– గంగు సత్యనారాయణశర్మ, డీడీఎస్ సంఘం జిల్లా కార్యదర్శి

నియామకాల్లో పారదర్శకత

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీడీఎస్ పోస్టుల నియామకాల్లో పారదర్శకత పాటించాం. దరఖాస్తులను పరిశీలించి, ఆలయాలను తనిఖీలు చేసి, అర్హులైన వారిని గుర్తించాం. అర్చకులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి. తనిఖీల్లో పట్టుపడితే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సమయపాలన పాటించాలి.
– నవీన్‌కుమార్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఉమ్మడి ఆదిలాబాద్

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్


అభివాదం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు ఏఐసీసీ ఆదివాసీ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్‌లో టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ అధ్యక్షతన సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్టీ సెల్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బెల్లయ్య నాయక్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ అధికారంలో వస్తే సిలిండర్ రూ. 500, బస్సులో ఉచిత ప్రయాణం, రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తుందని అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో తిరిగే నాయకులకు గుర్తింపు ఉంటుందని, టికెట్ నిర్ణయించేది అధిష్టానమే అని తెలిపారు. జిల్లాలో ఉన్న పది సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గోమాసే శ్రీనివాస్, వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నరేశ్‌జాదవ్, విశ్వప్రసాద్, మర్సుకోల సరస్వతి, సెడ్మకి ఆనంద్‌రావు, మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రభాకార్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాటిళ్లు

దహెగాం/కాగజ్‌నగర్‌టౌన్: దహెగాం మండల కేంద్రంలోని శ్రీ చక్రి మద్యం దుకాణంలో హైదరాబాద్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన తనిఖీల్లో నకిలీ మద్యం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ విలాస్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దుకాణంలో తనిఖీ చేయగా కల్తీ చేసిన 14 ఆఫీసర్ చాయిస్ ఆఫ్ బాటిళ్లు లభించాయన్నారు. మద్యం సీసాల్లో నీళ్లు కలిపి అమ్ముతున్నారన్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని షాప్‌లో పనిచేస్తున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.వెంకట రమణ తెలిపారు. ఉజ్వల త్రిఫ్ట్ కో ఆపరేటివ్ సొసైటీలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ పోస్టులకు ఇంటర్, డిగ్రీ పాసైన 35 సంవత్సరాలలోపు వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు మంచిర్యాల, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పని చేయాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9111731173, 6304600392 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆరుగురికి మూడేళ్ల జైలు

జైపూర్: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన పోటు తిరుపతికి సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తామని మోసగించిన కేసులో ఆరుగురికి సోమవారం కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. 2016లో ఎడ్ల రాజిరెడ్డి, ఉండేటి ప్రతాప్‌కుమార్, వెంకటనిర్మల్ కుమార్, కొత్త వెంకటయ్య, హర్షవర్ధన్‌రావు, ఒజ్జ కొమురయ్యలపై కేసు నమోదైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమలత చెన్నూర్ సివిల్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితులకు జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి సంపత్‌కుమార్ తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి చేస్తోందని ఆ యూనియన్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కే.లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం యూనియన్ ముఖ్యనేతలతో ఎల్–20 సదస్సు నిర్వహణపై చర్చించారు. సమావేశంలో మంద రమాకాంత్, పులి రాజారెడ్డి, యాదగిరి సత్తయ్య, పేరం రమేశ్, నాగేశ్వరరావు, నాతాడి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

బెల్లంపల్లి: ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జిల్లాకు చెందిన కొయ్యల ఏమాజీ, జాడి తిరుపతిని ఎన్నుకున్నారు. ఈనెల 17, 18 తేదీల్లో సంఘం రాష్ట్ర మహాసభలు భువనగిరిలో జరిగాయి. ఈ సందర్భంగా ఎన్నుకున్న రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు కల్పించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చెన్నూర్‌రూరల్: తమ భూమిని తమకు దక్కకుండా చేస్తున్నారని మండలంలోని కొమ్మెర గ్రామానికి చెందిన కమ్మగోని దుర్గ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామంలోని 47 సర్వే నంబరులో ఉన్న అయిదెకరాల భూమి తమకు వారసత్వంగా వచ్చిందని, తన భర్త శ్రీనివాస్ పేరు మీద పట్టాపాసు పుస్తకాలు ఉన్నాయని తెలిపింది. గతేడాది నుంచి కొందరు తమ భూమిని తమకు దక్కకుండా చేస్తున్నారని, ఎంపీపీ, స్థానిక సర్పంచ్ కుమారుడు భూమి విషయంలో జోక్యం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఎంపీపీని వివరణ కోరగా వారి భూమి విషయంలో తాను జోక్యం చేసుకోలేదని, తనపై అకారణంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

'ఓరియంట్'లో హరితోత్సవం


మొక్క నాటుతున్న అధికారులు

కాసిపేట(బెల్లంపల్లి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆవరణలో హరితోత్సవం నిర్వహించారు. యూనిట్ హెడ్ ఎంపీ జోషి, ఫారెస్టు రేంజ్ అధికారి అనిత ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఓరియంట్ మైన్స్ హెడ్ ఎస్‌పీ సహరే, యూనిట్ హెడ్ మహేంద్రప్రతాప్ జోషి పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పాతమంచిర్యాల: ఆయుష్మాన్ భారత్ ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాయిని బాపు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో మాదారం, తిర్యాణి, దేవాపూర్, కాసిపేటలలో పలువురు అమాయక గిరిజనులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తామని చెప్పి నకిలీ కార్డులు చూపించి నమ్మించాడు. బయోమెట్రిక్ యంత్రంలో వేలుముద్రలు స్కాన్ చేసి పదిమంది ఖాతాల్లోంచి రూ.2.73 లక్షలు తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. బాధితులు మాదారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తాండూరు ఐబీలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సోమవారం పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి హీరోహోండా బైక్, బయోమెట్రిక్ మిషన్, రెండు ఫోన్లు, నకిలీ ఆయుష్మాన్ భారత్ కార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో మాదారం ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

'గుర్తింపు' ఎన్నికలు జరగకుండా కుట్ర

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి, యజమాన్యం కలిసి కుట్ర చేస్తున్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. సోమవారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి రెండేళ్లు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించకుండా జాప్యం చేసిందన్నారు. హైకోర్టు ఆదేశంతో ఆర్‌ఎల్‌సీ ఎన్నికల నిర్వహణకు పూనుకున్నారన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు జరిగితే వారి కార్మిక సంఘం ఓడిపోతుందనే భయంతో కోల్‌బెల్ట్ ప్రాంతంలోని కలెక్టర్లతో ఎన్నికలు జరగకుండా సిబ్బంది కొరత ఉందని, శాంతిభద్రతల అంశం అంటూ ఒత్తిడి తెచ్చి లేఖలు రాయిస్తోందన్నారు. జూన్ 24న జరిగే ఎన్నికల సమావేశంలో ఎన్నికల తేదీని ఆర్‌ఎల్సీ ప్రకటించకుంటే అన్ని సంఘాలను కలుపుకుపోయి ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి గునిగంటి నరసింహారావు, పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, నాయకులు భీంరాజు, గజ్జి రమేశ్, సంపత్, అక్రంపాషా, అఫ్రోజ్‌ఖాన్, మల్లేశ్, మురళిచౌదరి, తిరుపతి, రవీందర్ పాల్గొన్నారు.

'సింగరేణిలో ఎన్నికలు వెంటనే నిర్వహించాలి'



మాట్లాడుతున్న కే.లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి, వేజ్‌బోర్డు సభ్యుడు కే.లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అధికార వర్గానికి సింగరేణిలో ప్రతికూల పరిస్థితులు ఉండటంతో ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని కేటాయించడం వీలుకాదంటూ కొత్తగూడెం కలెక్టర్ రిటర్నింగ్ అధికారికి లేఖ రాసినట్లు తెలిసిందని, ఇది ప్రజాస్వామ్య పద్ధతికి విరుద్ధమన్నారు. సమావేశంలో ఏబీకేఎంఎస్ కమిటీ సభ్యులు మంద రమాకాంత్, పులి రాజిరెడ్డి, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి రంగా పవన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, సెంట్రల్ కార్యదర్శులు కాసెట్టి నాగేశ్వరరావు, కాదాసి భీమయ్య, ఏరియా సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, రమేశ్, పంచర్ల నరేష్, చంద్రశేఖర్, గోపతి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చుతున్న జేసీబీ

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలోని ఎన్‌హెచ్ 63 పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను సోమవారం మున్సిపల్ అధికారులు కూల్చివేయించారు. ఎన్‌హెచ్ అధికారుల ఆదేశాలతో నస్పూర్ మున్సిపల్ కమిషనర్ టీ.రమేశ్, సిబ్బందితో కలిసి జేసీబీలతో నిర్మాణాలను నేలమట్టం చేయించారు. మంచిర్యాల నుంచి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు ఆర్నెల్లుగా నడుస్తుండటంతో ఇప్పటికే కొందరు రోడ్డుకు దగ్గరగా ఉన్న నిర్మాణాలను కూల్చివేసి వెనక్కి కట్టుకున్నారు. కొంతమంది నిర్ణీత దూరం జరగకుండానే కొత్త నిర్మాణాలు చేపట్టారు. వీటిని తొలగించాలని మూడు రోజుల నుంచి మున్సిపల్, ఎన్‌హెచ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో పోలీసు బందోబస్తు నడుమ జేసీబీలతో కూల్చివేశారు. రోడ్డు మధ్య భాగం నుంచి 66 ఫీట్ల వరకు రోడ్డు మార్కింగ్ చేసి ఆ పరిధిలో ఉన్న నిర్మాణాలను కూల్చివేశారు.

వర్తకుల అభ్యంతరం..
గతంలో రోడ్డు మధ్యలో నుంచి 60 ఫీట్లు మార్కింగ్ చేశారని, ఇప్పుడు 66 ఫీట్లు జరగాలని చెప్పి కొత్తగా కట్టుకున్నవి కూడా కూల్చివేస్తున్నారని కొందరు వర్తకులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- డీడీ దిలీప్‌కుమార్


అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలు సత్వరం పరిష్కరించాలని డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అర్జీలను పరిశీలించి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. అంతకు ముందు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన హరితోత్సవంలో భాగంగా ఐటీడీఏ ఆవరణలో అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, జే డీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- దంతన్‌పల్లి పీహెచ్‌సీలో అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలానికి చెందిన కుమ్రం సత్యవతి అర్జీ సమర్పించింది.
- ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి (చెరువుగూడ) గ్రామానికి వసతి గృహం మంజూరు చేయించాలని సోయం జంగు కోరాడు.
- డిగ్రీ కళాశాలలో స్వీపర్‌గా ఉద్యోగం ఇప్పించాలని ఆసిఫాబాద్ మండలం కేస్లాపూర గ్రామానికి చెందిన టీకం కవిత విన్నవించింది.

ఆగని గుప్తనిధుల తవ్వకాలు!


గుప్త నిధుల కోసం తవ్విన గొయ్యి

వేమనపల్లి(బెల్లంపల్లి): రాజారాం రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద గ్రామస్తులు జాతర ఏర్పాట్లకు సిద్ధం చేస్తుండగా అక్కడ జరిగిన తవ్వకాలు కలకలం రేపుతున్నాయి. ఆంజనేయస్వామి విగ్రహం పక్కనే నాలుగు రోజుల క్రితం గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు తెలుపుతున్నాయి. గత ఏప్రిల్ 11న ఇక్కడ గుడి నిర్మాణం పేరుతో గోతులు తవ్వారు. ఎలాంటి గుడి నిర్మించకపోవడంతో గుప్త నిధుల కోసమే గోతులు తవ్వారని గ్రామస్తులు కొందరు అనుమానిత వ్యక్తులను నిలదీశారు. రెండు నెలల తర్వాత మళ్లీ తవ్వకాలు జరపడం సంచలనంగా మారింది. రెండు రోజుల క్రితం గ్రామస్తులు నీల్వాయి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సుబ్బారావు దేవాలయం వద్దకు వెళ్లి ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఒక వర్గానికి చెందిన వారు మరో వర్గం వారిని ఇరికించేందుకు తాజాగా ఈ గోతులు తవ్వినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామన్నారు.